పది పరీక్షలకు అంతా సిద్ధం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- పోలవరం నియోజకవర్గంలో పరీక్షలకు 3,147 మంది విద్యార్థులు



బుట్టాయగూడెంలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



జంగారెడ్డిగూడెం శ్రీచైతన్య పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

బుట్టాయగూడెం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్‌లు వేయడంతోపాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకూ పరీక్షలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, టి. నర్సాపురం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సుమారు 3,147 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు సంబంధించి సుమారు 195 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే పరీక్షలు జరిగే వరకూ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, కంప్యూటర్ సెంటర్‌లు మూసివేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. నివాస ప్రాంతాల్లో ఉన్న పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సిబ్బంది ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా ధరించేలా ఆదేశాలు ఇచ్చారు. అలాగే విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఐటీడీఏ పరిధిలో 942 మంది విద్యార్థులు

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని 25 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 3 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 952 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు. అలాగే పరీక్షా కేంద్రాలకు చేరుకునే విద్యార్థుల కోసం గిరిజన సంక్షేమ శాఖ అధికారులు 8 బస్సులు, 22 ఆటోలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో పకడ్బందీ ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం: మండలంలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో బి.రాముడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో చెప్పారు. ప్రతి సెంటర్ సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రంలోనికి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకుండా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే విద్యార్థులు స్కూల్ యూనిఫామ్ ధరించి పరీక్షకు హాజరు కాకూడదని తెలియజేశాం. మాల్ ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేలా సీఎస్, డీవోలకు సూచనలు చేశామన్నారు.

మండలంలోని పరీక్షా కేంద్రాల వివరాలు

పట్టణంలో జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్ ఎ-సెంటర్‌లో 240 మంది, బి-సెంటర్‌లో 250 మంది, జెడ్పీ బాలికల హైస్కూలో 188 మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో 204 మంది, శ్రీచైతన్య స్కూల్‌లో 276 మంది, విద్యావికాస్ స్కూల్‌లో 235 మంది, త్రివేణీ హైస్కూల్‌లో 128 మంది, భాష్యం స్కూల్‌లో 220 మంది, ప్రతిభ స్కూల్‌లో 104 మంది, నారాయణ స్కూల్‌లో 104 మంది, మండలంలోని శ్రీనివాసపురం జెడ్పీ హైస్కూల్‌లో 144 మంది, లక్కవరం జెడ్పీ హైస్కూల్‌లో 280 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

అన్ని ఏర్పాట్లూ పూర్తి



పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, త్యవసర సమయంలో వైద్యం అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం.

– తెల్లం బాబూరావు, ఎంఈఓ, బుట్టాయగూడెం

విద్యార్థుల కోసం వాహనాలు



గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం 8 బస్సులు, 22 ఆటోలను ఏర్పాటు చేశాం. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి. ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదువుకోవాలి. మ్యాప్ పాయింట్స్, బిట్స్, ఒక మార్కు ప్రశ్నలపై సులభంగా పదికి పదిపాయింట్‌లు సాధించవచ్చు.

– శ్రీ విద్య, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ, బుట్టాయగూడెం

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల విరాళం



దాత మధుకళ్యాణ్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. కేసరపల్లికి చెందిన జస్తి మధుకళ్యాణ్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

గడ్డివాము దగ్ధం



గడ్డివాము దగ్ధమవుతున్న దృశ్యం

కామవరపుకోట: మండలంలో బొర్రంపాలెం అడ్డరోడ్డు వాటర్ ట్యాంక్‌ల సమీపంలో ఆదివారం విద్యుత్ తీగలు తెగిపడి గడ్డి వాము దగ్ధమైంది. పశువుల మేత కోసం పామాయిల్ తోటలో నిల్వ ఉంచిన గడ్డివాముపై విద్యుత్ తీగలు పడడంతో దగ్ధమైందని బాధితుడు మారం మధు తెలిపారు. వెంటనే జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు అదుపు చేశారన్నారు. కరెంటు సర్వీస్ వైర్లు లూజ్ కండక్ట్ కారణంగా తెగిపడ్డాయని, ఈ ప్రమాదంలో తనకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం అందించాలని బాధితుడు మధు కోరారు.

పరామర్శ



శేషారత్నం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విజయరాజు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల యాదవ్ కుటుంబ సభ్యులైన గోరుముచ్చు శేషారత్నం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఆదివారం కంటమనేనివారిగూడెంలో ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పరామర్శించారు. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధర్మదాసు, నానాది సాగర్, ప్రభాకర్ ఆనంద్, మానుకొండ దేవరాజు, సకల బత్తుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ కార్యవర్గానికి సత్కారం



క్లబ్ నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా రోటరీ ఇన్నర్ విల్ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులనేవి అలంకారప్రాయం కాకూడదని, సేవ చేసే దిశగా పయనించినప్పుడే సమాజంలో విలువ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు నాగసూరి మాధురి కార్యదర్శి పద్మజ్యోతి, కోశాధికారి ఆదిలక్ష్మి, చిన్ని సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



3వ వార్డు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో అలరిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: స్థానిక ఎస్సీ కాలనీలోని 3వ వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఉస్సే కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఉపాధ్యాయులు సుశీల రాజకుమారి, రాజ్యలక్ష్మి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: మండలంలోని పేరంపేట గ్రామ శివారులో కోడి పందాల స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఈ దాడిలో రూ.3,200 నగదు, ఒక కోడి పుంజు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.

అగ్ని ప్రమాదంలో బేరన్ పాక్షికంగా దగ్ధం

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో వర్జీనియా పొగాకు బేరన్ పాక్షికంగా దగ్ధం అయ్యింది. శుక్లబోయిన గోపీచంద్, వెంకటేష్‌లకు చెందిన బేరన్ క్యూరింగ్ దశలో ఉండగా ఈ ప్రమాదం సంభవించిందని జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం అధికారి జి.అబ్రహం తెలిపారు. ప్రమాదం వలన సుమారు రెండున్నర లక్షల రూపాయలకు పొగాకు దగ్ధం అయ్యిందని చెప్పారు.

ముడిచర్ల వాసికి అభినవ రామానుజ అవార్డు



సికింద్రాబాద్‌లో అవార్డు అందుకున్న శ్రీనివాస్

లింగపాలెం: ముడిచర్లకు చెందిన శ్రీమాన్ తిరుక్కోవళ్ళూరి శ్రీనివాస పెరుమాళ్‌కు గోల్డ్ మెడల్, సువర్ణ ఘంటాకంకణ సత్కారంతో పాటు 'అభినవ రామానుజ' అవార్డు లభించింది. ఎన్నో ఏళ్లగా రామానుజ సమతాసిద్ధాంత వ్యాప్తికై చేస్తున్న విశేష కృషిని గుర్తించి, హైదరాబాద్‌కు చెందిన సర్ సీవీ రామన్ సాంస్కృతిక సేవాసంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వారు ఈ అవార్డును ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్ ఆడిటోరియంలో ప్రదానం చేశారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా, ప్రవృత్తి రీత్యా భక్తి గేయ రచయితగా, కవిగా, జ్యోతిష్యుడిగా, గాయకుడిగా, అర్చక పురోహితుడిగా, పుస్తక రచయితగా, ప్రవచనకారుడిగా, ఆధ్యాత్మిక గురువుగా వివిధ మార్గాల్లో రామానుజ సమతాసిద్ధాంతాన్ని శ్రీనివాస్ పెరుమాళ్ వ్యాప్తి చేస్తున్నారు. ఆయనకు 'అభినవ రామానుజ' అవార్డు రావడం పట్ల ఆయన శిష్యులు సంతోషం వ్యక్తం చేశారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



కొయ్యలగూడెం: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు



జంగారెడ్డిగూడెం: పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు



కామవరపుకోట: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ శాఖ సభ్యులు

కొయ్యలగూడెం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం పూలమాల వేసి నివాళి అర్పించింది. అదేవిధంగా కన్నాపురం, బొప్పరామన్నగూడెం, పొంగుటూరు గ్రామాల్లోని అమరజీవి విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాటూరు సుదీర్, కంభంపాటి సాయి, ఎం.ఉమామహేశ్వరావు, మద్దు గోపి, బొమ్మ శ్రీనివాస్ (బాబు), మట్టి శ్రీనివాస్, చిరవూరి గౌరీ, మండా నాగేశ్వరరావు, కొల్లూరు అనిల్, ఉద్దగిరి పవన్, మాటూరు పంచాక్షరీ(చంటి) , బొమ్మ సాయి వాణిశ్రీ, కొల్లూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. పట్టణంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగాన్ని ప్రతి తెలుగువాడు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాశీ, బాపిరాజు, శ్రీనివాసరావు, చిన్ని, గుడిమెట్ల యుగంధర్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు

కామవరపుకోట: స్థానిక కామవరపుకోట గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ శాఖ ఛైర్మన్ షేక్ ఇబ్రహీం అధ్యక్షతన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఆయన్ను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కోశాధికారి టీవీఎస్ రాజు, వీరమళ్ళ సత్యన్నారాయణ, లాల్ జాన్, రఫాయేలు, గ్రంథ పాలకులు భీమరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో డిగ్రీ కాలేజీ అధ్యాపకుడి మృతి

గణపవరం: గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డా.టి అక్కిరాజు (60) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులిద్దరూ జర్మనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. భీమవరంలో నివాసం ఉంటున్న అక్కిరాజు గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో గత నాలుగేళ్లుగా ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య, కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

భీమడోలు: సూరప్పగూడెం చర్చిలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. రక్షణ సైన్యం చర్చి ఫాదర్ కె.అబ్రహాం మాట్లాడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.

నేడు కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం గణపతిపూజతో మొదలుకుని మంత్రహోమాలు, నవగ్రహ హోమాలు, ఉదకశాంతి, నవకలశ స్థాపన, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, పుష్పాధివాసం, బలిహరణలు నిర్వహించారు. అలాగే గ్రామోత్సవం నిర్వహించారు. నారాయణ వేద పారాయణలు, హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేది స్వస్తి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో విగ్రహ, యంత్ర, శిఖర, ధ్వజ, పరివార దేవతా ప్రతిష్ఠా వైభవంగా త్రిదిన దీక్షతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఉత్సవాల్లో భాగంగా నవకలశ స్థాపన నిర్వహిస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, అధ్యక్షుడు మోతుకూరి నారాయణరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

దుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



కనకదుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 14వ తేదీన అమ్మవారి తిరణాళ్ల ప్రారంభం కాగా మూడోరోజు ఆదివారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఉన్న పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ తిరణాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జీలుగుమిల్లి సీఐ బి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై దుర్గామహేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా మరో రెండురోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి.

వైభవంగా అమ్మవార్ల గంప జాతర

భీమడోలు: భీమడోలు జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామదేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుల గంప జాతర వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మైదానం నందు గల గంగానమ్మ వారి పురాతన దేవాలయం వద్ద గంప జాతరను ఘనంగా నిర్వహించారు. పంబలి తంగిరాల చిట్టియ్య నేతృత్వంలో గణాచారుల సంబరం చేశారు. గంగానమ్మకు వేపాకులతో కలిగిన పసుపు నీళ్ల బిందెలతో జలాభిషేకం చేశారు. తొలుత గణాచారులు మేళాతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల ప్రాంగణాల వద్ద గణాచారులకు భోజనాలు ఏర్పాటు చేసి నూతన వస్త్రాలు బహూకరించారు.

ముగ్గుళ్లమ్మకు పూజలు

గణపవరం: ముగ్గుళ్ల గ్రామ దేవత శ్రీ ముగ్గుళ్ల అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండురాము, జిల్లా వ్యవసాయ సలహా సంఘం మాజీ అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మిబాబు, స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ దైవ భీతి ఉండాలి



స్వరమాధురి గ్రూప్ సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావం, దైవభక్తి కల్పించాలని ఉద్దేశంతో స్వరమాధురి గ్రూపును ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు ఉమామహేశ్వరరావు, కోఆర్డినేటర్ సుగంధం రాంబాబు తెలిపారు. చింతలపూడిలో ఆదివారం నిర్వహించిన స్వరమాధురి గ్రూప్ సమ్మేళన కార్యక్రమంలో సాంస్కతి కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తపన ఫౌండేషన్ ఛైర్మన్ గారపాటి సీతారామ చౌదరి విజేతలకు బహుమతులు అందించారు. గ్రూపు అధ్యక్షులు ముల్లంగి విలాస కుమారి, ఉపాధ్యక్షులు ఆకుల లలిత, సలహాదారు బే తిన కవిత, కె నాగేంద్ర, ఆకుల పురుషోత్తం, వాసు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య పాదయాత్ర

టి.నరసాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా హామీల అమలులో వెనకబడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. టి.నరసాపురంలో సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన ప్రజా చైతన్య పాదయాత్రను నిర్వహించారు. ఈ యాత్ర మండలంలోని అల్లూరి సీతారామరాజునగర్, ప్రకాష్‌నగర్, రామమ్మగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో అధికార కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం వర్తింప చేస్తూ, సదరు భూముల్లో పని చేస్తూ నష్టపోయిన కూలీలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇంటి రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ పాదయాత్ర లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకటరావు, మండలం కమిటీ సభ్యులు అనుమోలు మురళి, మడకం కుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.



టి.నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో సీపీఎం ప్రజాచైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా పోరు చైతన్య మోటార్ సైకిల్ యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఎ.పోలవరంలో యాగంటి సీత అధ్యక్షతన ప్రజాపోరు చైతన్య మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎర్రకాలువ మిగిలిన భూములు వందల ఎకరాలు ఉన్నప్పటికీ పేదలకు భూమి పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. చల్లవారిగూడెం పునరావాస కాలనీ నిర్వాసితులు కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పునరావాస సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఎ.పోలవరంలో ప్రజాపోరు చైతన్య యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం